# తాపత్రయం

ఆ అమ్మాయి పేరు వెంకూబాయిట. మా వాడికి పేరుతో నిమిత్తం లేదుట. అయినా వెంకూ అని పిలుస్తాడట.

"వెంకూ!" అని ముద్దుగా పిలవటం ఆ అమ్మాయిని ప్రత్యక్షంగా కాదు. మాతో ఆ అమ్మాయిని గురించి పరోక్షంలో మాట్లాడేటప్పుడు.

మావాడు; అంటే సుబ్రహ్మణ్యం ఆ అమ్మాయి పేరు తలచని రోజు లేదు. ప్రతి రోజూ ఏదో విధంగా సంభాషణ లోకి ఆ పేరు లాక్కొచ్చి కొన్ని వందలసార్లు ఉచ్ఛరించి మానసికంగా తృప్తిపడతాడు.

"నువ్వా అమ్మాయితో ఎప్పుడన్నా మాట్లాడేవా?" అని అడిగా ఒకరోజు విసిగి.

తెల్లమొహం వేశాడు. "అదెలా సంభవమౌతుందీ?" అనడిగాడు.

"మాట్లాడటం చేతకాని దానికి వెర్రి వెంగళప్ప లాగా అలా పడి చావటమెందుకూ?" అని అడిగా మళ్ళీ.

సుబ్రహ్మణ్యం రోజూ సాయంత్రం పూట ఆ పిల్ల యింటి చుట్టూ తిరగటం, చూసి ఆనందించటం నాకు తెలిసిన విషయం.

"మాట్లాడకపోయినంత మాత్రాన నాకు యిష్టంలేదనుకోవడం పొరపాటు" అన్నాడు.

నాకో ఆలోచన వచ్చింది. "నువ్వామెను ప్రేమిస్తున్నావా?" అన్నాను.

ఈ ప్రశ్నకు కంగారు పడ్డాడు. రెండు నిమిషాలు తడబడి, "అలా అంటే చెప్పటం కష్టం. మొత్తానికి ఆమె అంటే_ వెంకూ అంటే చాలా యిష్టం" అన్నాడు.

ఆమె ఆరాధకులు చాలామంది ఉన్నారని విన్నాను. వాళ్ళలో ఒకడు యీ వాజెమ్మ అనుకున్నాను.

ఉన్నట్టుండి నన్నోరోజు ఒక ప్రశ్న అడిగాడు. "వెంకూ ప్యాసవుతుం దంటావా?" అని.

ఆమె యింటర్ కి మొన్ననే ఎపియరయింది. వీడో? మెట్రిక్యులేటు.

"నాకేం తెలుసు?" అన్నా విస్తుపోతూ.

"చాలా తెలివిగలది తెలుసా?" అన్నాడు. "ఊఁ" కొట్టి వూరుకున్నాను.

"ఎక్సుపెక్టింగ్ ఫస్టుక్లాస్" అన్నాడు మళ్ళీ.

"ఆవిడా? నువ్వా?"

"ఆమె కెలాగూ ఫ్యూర్రెటీ వుంది. నేనూ అంచనా వేశాను" అన్నాడు. విని ఊరుకున్నాను.

"కాని, వెంకూ నెంబరు నాకు తెలీదు" అన్నాడు ఒక నిమిష మాగి దిగులుగా.

గ్రేట్ యిన్సల్టు అనుకున్నాను మనసులో.

"వెళ్ళి అడుగు" అని సలహా యిచ్చాను.

ఒప్పుకోలేదు.

"అయితే ఏడు" అన్నాను. కొంతసేపు ఆలోచించుకుని, "అయితే ఆలోచిస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

మూడోనాడు పొద్దున్న కాఫీ హోటల్‌లో కలుసుకున్నాము.

"అడిగాను నంబరు గురించి" అన్నాడు.

"చెప్పిందా?" అన్నాను.

సుబ్రహ్మణ్యం జరిగిన సారాంశాన్ని వర్ణించాడు.

నిన్న సాయంత్రం ఆ అమ్మాయి వీధి గుమ్మంలో నిల్చుని వుందిట. మొదట ధైర్యం చాలక అటూ యిటూ రెండు మూడు సార్లు తిరిగేశాడుట.

సరే చివరికి ఎలాగో ధైర్యం తెచ్చుకున్నాడుట. ఒక సారి జేబు రుమాలుతో ముఖం తుడుచుకున్నాడుట. ఆ తర్వాత తడబడుతున్న కాళ్ళతో, వడిగా కొట్టుకుంటున్న గుండెలతో ఆమెకు చాలా దగ్గిరికి పోయి నిల్చున్నాడుట.

ఆ అమ్మాయి వీణ్ని చూడగానే ముఖం చిట్లించుకుని లోపలికి పోబోయిందట.

సమయం మించిపోతూందని "నీ నంబరెంత?" అని అడిగేశాడట

"నీ కెందుకూ?" అందిట ఆమె.

వీడికి, అంటే మా సుబ్రహ్మణ్యానికి కాళ్ళు వణికాయిట. గుండె దడ దడ కొట్టుకొందిట. అయినా, వెంటనే తిరిగి వచ్చేస్తే అవమానకరంగా వుంటుందని "నాకు కాకపోతే యింకెవరికి?" అన్నాడుట.

"ఛీ, ఛీ! అవతలకి ఫో" అని ఆ అమ్మాయి లోపలికి వెళ్ళిపోయిందిట విసురుగా.

ఇదీ వాడు చెప్పిన సారాంశం.

"ఇంకా ఏ మొహం పెట్టుకుని ఆ వీధిలో తిరదగలుగుతున్నావు?" అని అడిగాను—వాడు చెప్పింది విని.

"ఈ మొహం పెట్టుకునే అయినా ఎందుకు తిరగగూడదా? ఆ అమ్మాయికి, అంటే వెంకూకి నే నంటే ఎటువంటి అభిప్రాయం వుంటే ఏం? నాకుమట్టుకు ఆమెమీద ఒకటేఅభిప్రాయం. ఆమె ఏమన్నా కోపం తెచ్చుకోను" అన్నాడు.

వీడ్నింకా ఏమనాలి? సిగ్గులేనివాడని అనుకుని ఊరుకున్నాను. ఆ తర్వాత వాడు అష్టకష్టాలూపడి, ఎలాగయినా ఆ అమ్మాయి నంబరు ఎంతో అంతు తేల్చుకున్నాడు.

ఒకరోజు మా యింట్లో కూచుని వున్నాను; చేతిలో పేపరు పట్టుకొని పరుగెత్తుకుంటూ వచ్చాడు సుబ్రహ్మణ్యం.

"ఏమిట్రా సంగతీ?" అన్నాను.

"వాళ్ళ రిజల్ట్సు వచ్చాయి" అన్నాడు......అర్థం చేసుకున్నాను ఎవరివో.

"ఆమె ప్యాసయ్యింది" అన్నాడు......అర్థం చేసుకున్నాను ఎవరో.

"కంగ్రాట్సు" అన్నాను వీడికే—విధిగా.

"క్లాస్ వచ్చింది తెలుసా?"

"సంతోషం."

"అయితే పద" అంటూ నా రెక్క పుచ్చుకున్నాడు. "ఎక్కడికి?" అని అడిగాను.

"నీకు టీపార్టీ."

"ఎందుకు?"

"ఆమె ప్యాసయినందుకు."

"ఆమె ప్యాసయితే నువ్వెందుకోయి యిప్పించటం?"

"అదంతా నీ కనవసరం. అయినా నీకు తెలీదు. లే. పద" అంటూ బయల్దేరతీశాడు.

నాకు తెలియంది, వాడికి తెలిసిందీ ఏమిటో నాకు అర్థం కాలేదు. వాడి బలవంతం భరించలేక బయలుదేరాను. హోటలుకు పోయి రూపాయిన్నర బిల్లు చేశాను.

కాని, వీడ్నేమని పిలవాలో నాకుమట్టుకు అర్థం కాలేదు.